
15—9—82



# అద్దం వెక్కిరించింది

అలపర్తి రామకృష్ణ

**ఎదురుగా** గూట్లో పగిలిన అద్దం చూసేసరికి చిర్రెత్తుకొచ్చింది సుబ్బులికి.

తన అందమైన ముఖం రెండు ముక్కలుగా కన్పించేసరికి మరీ దిగులు పడింది.

మంచి అద్దాన్ని కొనుక్కోలేని తన పేదరికాన్ని మరోసారి తిట్టుకుంది చేసేదిలేక.

మరో క్షణంలో గంటల తరబడి డ్రెస్సింగ్ టేబుల్‌దగ్గర కాలక్షేపం చేసే తన స్నేహితురాలు ప్రమీల మెదలింది మెదడులో.

డ్రెస్సింగ్ టేబుల్‌కు అమర్చిన నిలువు టద్దం తన పగిలిన అద్దాన్ని చూసివికటాట్టహాసం చేసినట్లనిపించింది.

ప్రమీల తనను చూసి నవ్వినట్లని పించింది.

తనూ ఒక పెద్ద అద్దం కొనుక్కుంటే పోలా?

బావ ఆఫీసునుంచి రాగానే చెప్పేయాలి. మంచి అద్దం కొనుక్కోవాలి!

ప్రమీల ఎంత అదృష్టవంతురాలు!

పెద్ద బంగళా—ఆమె కో కారు. వాళ్ళాయన కో కారు. ఇంట్లో టి.వి.. వాషింగ్ మెషిన్, ఎయిర్—కండిషన్డ్ రూములు. ఇంట్లోకి పనికొచ్చే ఏ వస్తువైనా సరే, మార్కెట్‌లోకి వచ్చిన రోజే వాళ్ళింట్లో చేరాల్సిందే!

ప్రమీలకు తను ఆత్మీయురాలవడం తన అదృష్టం!

తన పక్కన కూర్చుని ఆమె చెప్పే కబుర్లు వింటే చాలు, ఆమెకు ఎంతో సంతోషం.

ఆమె సంపదతో పోల్చుకుంటే తన తాహతెంత?

ప్రమీలతో స్నేహం గొప్ప భాగ్యం.

ఆమె వాడే సెంటు సీసా ఖరీదు చెయ్యదు తన జీవితం.

చిన్నప్పుడు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తాను, ప్రమీల కలిసి చదువుకున్నారు. అప్పటి స్నేహం తరగలేదు కానీ, ఇప్పుడు ఇద్దరి జీవితాల్లో ఎంత తేడా !

భుజాలపై శివరావు చేతులు పడటంతో ఉలిక్కిపడింది.

తనను ప్రేమగా అల్లుకుపోతున్న అతని చేతులు చూడగానే సుబ్బులు గుండె కుదుటపడింది.

"మనం కూడా పెద్ద నిలువుటద్దం కొనుక్కుందామండీ!" అంది సుబ్బులు, శివరావు చేతులు నిమురుతూ.

"రేపే జీతాలిచ్చే రోజు. మొట్టమొదటి జీతం అందుకోబోతున్నా. నీకు నచ్చిన అద్దం కొనుక్కుందువుగానిలే" అన్నాడు శివరావు.

"నేను చేసేది అటెండర్ ఉద్యోగం. పైగా ఉద్యోగంలో చేరి నెల రోజులు కూడా కాలేదు. మన కెందుకే నిలువుటద్దాలు?" అనలేదు అతను. అత నలా అనలేదు కాబట్టే అతనంటే ఆమె కిష్టం.

"ఈ గోడలకి సున్నం కొట్టించావనుకున్నాం. నవ్వారు మంచం, చెక్క టేబుల్, వంటకి గిన్నెలు కొనాలను కున్నాం. నీ జీతం డబ్బులు సరిపోవు కదా?" అంది దిగులుగా తను కొనాలనుకున్న వస్తువుల జాబితా గుర్తుకు వచ్చేసరికి.

"నిదానంగా ఒక్కొక్కటే కొనుక్కుందాలే" అన్నాడు శివరావు, ఆమెను సముదాయిస్తూ.

పగిలిన అద్దం చూసిన దగ్గర నుండి ఆమె కెందుకనో చిరాగ్గానే ఉంది.


కట్టెల పొయ్యి పొగచూరి నల్లరంగేసినట్లున్న మట్టి గోడలు, అలికి నట్లే లేకుండా పెచ్చులు లేచిన నేల, ఒక మూల బోర్లించిన గిన్నెలు, నీళ్ళ కుండలు, నులక మంచం, మరో మూల తాడుమీద వేలాడుతున్న పాతబట్టలు, పాత ట్రంకుపెట్టె... ప్రమీల గారింట్లో తాను తెచ్చుకున్న ఖాళీ బోర్నవిటా డబ్బాలే కొత్త వస్తువుల్లా కనబడుతున్నాయి.

టి. వి., గ్రైండర్, వార్డ్‌రోబ్, వాషింగ్ మెషిన్, గీజర్...ప్రమీల గారింట్లో ఆ వస్తువులు చూసి ఆ పేర్లు వెంటనే నోరు తిరగక, తనేదో అంటే ఆమె నవ్వడం, తను సిగ్గుతో కుంచించుకుపోవడం మామూలయి పోయింది.

ఆ వస్తువులన్నీ తనకు లేకపోయి నందుకు బాధపడటం లేదు గాని, తన అందం అద్దంలో చూసుకోవడానికి సరైన అద్దం లేకపోవడమే తనకి బాధ కలిగిస్తున్నది.

తను పదో తరగతి ఫస్ట్ క్లాసులో పాసయి చదువు మానేసింది. ప్రమీల

# కాలిన గాయమా?



కాలితే వెంటనే రాయండి బర్నాల్ —
కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స

కాలిన గాయాల బాధే వేరు.
కాలిన గాయాలు చురుక్కుమంటూ నొప్పి పెడతాయి. కాలితే పొక్కులు లేస్తాయి. వాటికి కావలసింది గాయాలను మాన్పే మందు—బర్నాల్ యాంటీసెప్టిక్ క్రీమ్. బర్నాల్ చల్లదనాన్నిచ్చి వెంటనే ఉపశమనాన్నిస్తుంది. పొక్కులు లేవకుండా వెంటనే ఆపుతుంది. కాలిన గాయాలను త్వరగా మాన్పే మందు, బర్నాల్ యాంటిసెప్టిక్ క్రీమ్‌లో ఉంది.
ఎప్పుడూ బర్నాల్‌ని ఇంట్లో ఉంచుకోండి.




# బర్నాల్
కాలిన గాయాలకు ప్రత్యేక చికిత్స

BC 5641


ఏదో తరగతిలో రెండుసార్లు తప్పి, ఆ తర్వాత గట్టెక్కి ఎమ్. ఎ. కూడా పాసయింది.

ఎదురుగా గూట్లో...

పగిలిన అద్దంలో...

రెండు భాగాలుగా చీలిన తన ముఖం...

అద్దంలో వెక్కిరిస్తున్న తన అందం...

శివరావు గట్టిగా సుబ్బులు భుజాలు కుదిపే వరకూ అలా పగిలిన అద్దం కేసే చూస్తూ ఉంది.

ఆమె కేదో గుర్తుకు వచ్చి శివరావు కేసి తిరిగింది.

"టి. వి. లో ఏదో మంచి సినిమా ఉందట. అది చూసేసి ఈ పూట అక్కడే పడుకోమంది ప్రమీల. వాళ్ళాయన ఢిల్లీ వెళ్ళారట. తనకేం తోచడం లేదట. నన్ను తోడుగా ఉండమంది."

"మరి నా సంగతో?" అన్నాడు శివరావు. ఇప్పుడు దిగులు పడటం అతని వంతయింది.

"గిన్నెలో పొద్దుటి చేపల పులుసు ఉంది. అది తినేసి, మజ్జిగ నీళ్ళు తాగేసి నులకమంచం మీద హాయిగా పడుకో!"

"నువ్వు పక్కన లేందే నిద్దుర పట్టదే!" అన్నాడు ఆమె నడుంమీద చెయ్యి వేసి దగ్గరకు లాక్కుంటూ.

"మంచి అద్దం కొనలేరు గానీ, ఎప్పుడూ ఇదే పిచ్చి" అంది అతన్ని విదిల్చుకుంటూ.

ఆమె నడుంమీద నుంచి చేతులు తీసేశాడు చటుక్కున.

అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అతన్ని ఆ స్థితిలో చూసేసరికి ఆమె హృదయం ద్రవించింది. భర్తను కసురుకోవడం అదే మొదటిసారి. తనలో ఏదో దయ్యం ప్రవేశించిందా రోజు అనుకుంది.

"తప్పు నాదేనండి! నన్ను క్షమించండి!" అని అనలేదామె.

అతని దగ్గరగా వెళ్ళి, అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది.

ఆమె కళ్ళు అతని కళ్ళతో రెండు క్షణాలు మూగబాసలు చేశాయి.

అతని మొహంలోకి పోయిన కరెంటు మళ్ళీ వచ్చినట్టయింది.

ఆమె చిరాకు ఎందుకో అతనికి తెలుసు. పేదరికాన్ని విసుక్కున్నా, కసురుకున్నా మొదటికే మోసం అని కూడా తెలుసు. ధనికుల బతుకులను, తమ మెతుకులాంటి బతుకులను పోల్చి చూసుకుని విచారపడటం తప్పని కూడా తెలుసు. శ్రామిక జనం కష్టంతో ధనికులు పొట్టలు నింపుకుంటున్నారని కూడా తెలుసు. ఇవన్నీ తెలిసి నోటికి అడ్డు లేకుండా వాగినందుకే తనకి గవర్నమెంటు ఉద్యోగం దొరక్క ప్రైవేటు కంపెనీలో అటెండరు ఉద్యోగం చేయాల్సి వచ్చిందని కూడా తెలుసు.

అన్నీ తెలిసినా ఏమీ తెలియని అమాయకుడిలా ఉంటాడతను.

"నే నిక వెళతాను" అంది సుబ్బులు గొంతు పెగుల్చుకుని.

"వెళ్ళక తప్పదా?"

"వెళ్ళకపోతే ప్రమీలగారికి కోపం వస్తుంది."

"నువ్వెళ్ళితే నాకు కోపం రాదా?"

"నీకు రాదు" అనేసి ఇంట్లో నుంచి బయట పడింది సుబ్బులు.

● ● ●

ప్రమీలకుమాత్రం కోపం వచ్చింది, సాయంత్రం అయిదింటికి వస్తానన్న సుబ్బులు రాత్రి ఎనిమిదింటికి వచ్చేసరికి.

కానీ సుబ్బుల్ని చూడగానే చన్నీళ్ళు తగిలిన పాలపొంగులా చప్పున కోపం దిగిపోయింది.

మేడ మెట్ల మీదే సుబ్బులికి ఎదురొచ్చి పైకి తీసుకెళ్ళింది.

ఇద్దరూ సోఫాలో కూర్చుని టి. వి. చూశారు.

కింద తివాచీమీద కూర్చుని టి. వి. చూస్తున్న వాచ్‌మన్, వంట మనిషిని చూడగానే ఆ కాసేపు తానేదో ఉన్నత స్థానంలో ఉన్నట్టుగా అనుభూతి కలిగింది సోఫాలో కూర్చున్న సుబ్బులికి.

టి. వి. లో ప్రోగ్రామ్ అయిపోయేక వంటమనిషి వాళ్ళిద్దరికి వడ్డించి వెళ్ళిపోయింది.


చాలాసేపు కబుర్లు చెప్పుకుంటూ డైనింగ్ టేబుల్ దగ్గర కాలక్షేపం చేశారు.

బెడ్‌రూములోకి చేరుకున్నాక కట్టుకున్న బట్టలు తీసేసి నైట్ గౌన్ వేసుకుంది ప్రమీల. పాలమీగడ రంగులో ఉన్న ఆ నైట్ గౌను నల్లటి ఆమె శరీరాన్ని కప్పుకుంటుంటే విచిత్రంగా ఆమెవైపే చూస్తూ ఉండిపోయింది సుబ్బులు.

గులాబీ రంగులో ఉన్న మరో గౌను సుబ్బులి కిచ్చిందామె. నైట్ గౌను వేసుకోవడానికి సంకోచించింది.

ప్రమీల బలవంతం చేయడంతో వేసుకోక తప్పలేదు.

నైట్ గౌను వేసుకుంటూ ఎదురుగా డ్రెస్సింగ్ టేబుల్‌కి అమర్చిన అద్దంలో చూసుకుంది సుబ్బులు.




నిండుగా ఉన్న వక్షోజాలు లైటు వెలుగులో పచ్చగా మెరుస్తూ కన్పిం చేయి. అరిటి బోదెలాంటి తొడలు అసహనంగా కదులుతూ...

నిలువు టద్దంలో తన అందం...

నగ్నంగా అద్దంలో తనను తానే చూసుకోవడం అదే మొదటిసారి.

తను నిజంగానే, అందంగా ఉంది.

''బ్యూటిఫుల్!'' తన వంకే కళ్ళార్ప కుండా చూస్తూ ఉన్న ప్రమీలను చూడగానే అదరా బాదరా నైట్ గౌను గుండీలు పెట్టుకుంది.

దుప్పటి, దిండు తీసుకుని నున్నటి గచ్చుమీద పడుకోబోయింది సుబ్బులు.

పేడవాసన కొట్టే ఇంటి దగ్గర అలికిన నేలను ఈ నున్నటి మొజాయిక్ ఫ్లోరింగుతో పోల్చి చూసుకుంది.

మళ్ళీ దిగులు ఆమెని ఆవరించింది.

గచ్చుమీద పడుకోబోతున్న సుబ్బుల్ని వారించి తన మంచంపైనే పడుకోబెట్టు కుంది.

యూ—ఫోమ్ బెడ్‌మీద పడుకోగానే ప్రాణాలు గాలిలో తేలిపోతున్న ట్లనిపించింది సుబ్బులికి.

నులక మంచంలో ఇరుకిరుగ్గా ఉండేది.

పెళ్ళవక ముందు తను, చెల్లెలు ఒకే మంచంమీద పడుకునే వాళ్ళు. చెల్లెలు తనమీద కాలు వేసినప్పుడల్లా విసుక్కునేది.

పెళ్ళయ్యాక కూడా నులక మంచం తప్పలేదు ఆమెకి.

''మంచం ఇరుకుయిందండీ!''

''నీ తల్లో పేలు నా తల్లోకి ఎక్కు తున్నాయే, సుబ్బులూ!''

రోజూ ఇదీ వాళ్ళిద్దరి మధ్య చిలిపి వాదన.

''నీ తొలిరాత్రి అనుభవం చెప్పవే, సుబ్బులూ! నీ మొగుడు ఏడిపించేడా?''

ప్రమీల ప్రశ్నకి ఉలిక్కిపడిం దామె.

''ఏం తోచక అడిగాను లేవే? ఎవ్వరికీ చెప్పనులేవే! నీతో ఎంతో స్నేహంగా ఉండే నా దగ్గర కూడా దాపరికమేనా?'' అందామె లాలనగా సుబ్బులు మీద చేతులు వేస్తూ.

ప్రమీల తనను అంత ఆదరంగా, ప్రేమగా చూస్తుంటే, ఆమె దగ్గర తనకు దాపరికాలు ఉంటాయా?

మొదటి రాత్రి అనుభవమేమీ కాదు తనది. పట్టపగలే మొదటిరాత్రి అను భవాన్ని పొందింది.

ఆ పగలే పండు వెన్నెల్లా. . . శివరావు కౌగిలే పట్టుపరుపు మెత్తదనంలా తోచింది.

నాన్న ఫ్యాక్టరీ కెళ్ళా డప్పుడు...

శివరావు బావ వచ్చేడు.

''మంచినీళ్ళు కావాలి?'' అని అడగ లేదు బావ.

''ఉద్యోగానికి దరఖాస్తు పెడు తున్నాను. పోస్టేజీ స్టాంపులకి డబ్బు ల్లేవు'' అన్నాడు తల వంచుకుని.

ప్రేమగా బావ కళ్ళలోకి చూసింది.

గుండె పొంగింది తనకి.

తలుపులు దగ్గరకు వేసింది.

సుబ్బులు తన మొదటి అనుభవం గురించి చెబుతుంటే, ప్రమీలకి తన మొదటి రాత్రి తాలూకు చేదు అనుభవం గుర్తుకొచ్చింది.

ఆయున్ని పెళ్ళికి ముందు చూపించ కుండానే పెళ్ళి చేశారు. గొప్ప కుటుం బీకులు, కోటీశ్వరులని చెప్పా రందరూ. పెళ్ళిలో కూడా ధైర్యంగా తలెత్తి ఆయనకేసి చూడలేకపోయింది.

మొదటి రాత్రి...

''ద్రాక్షపళ్ళు పుల్లగా ఉన్నాయి గాని, యాపిల్ కాయ ముక్కలు కోసిపెట్టు.'' తన భర్త తనతో మొదటి రాత్రి మొట్టమొదటిసారిగా మాట్లాడిన మాటలు.

తనకంటే నల్లగా, తుమ్మ మొద్దులా ఉన్న ఆయన శరీరం తనపై పడి....

ఒకే క్షణం...

అదే నా తొలిరాత్రి అనుభవమంటే?

''పాలన్నీ నేనే తాగేశాను. నీకేం మిగిలినట్లు లేవు. సారీ!'' భర్త బొంగురు గొంతు.

మరో క్షణంలో ఇల్లెగిరిపోయే టట్లు ఆయన గుర్రు...

నిద్ర పట్టలే దా రాత్రి.

ఆ రాత్రేకాదు ఎన్నో రాత్రులు నిద్ర పట్టలేదు తనకి.

తన అనుభవాలు చెబుతూ ఏడుపు ఆపుకోలేక భోరున ఏడ్చింది ప్రమీల.

సుబ్బులుకి అంతా అయోమయంగా ఉంది.

వీళ్ళ భవనాలు, కార్లు చూసి వీళ్ళకేం దిగుళ్ళా ఉండవనుకుంది తను...కానీ, తనే అదృష్టవంతురాలేమో ప్రమీల కంటే? సమస్యలతో సతమతమవు తున్నా, తమ మధ్య ఎటువంటి పొర పొచ్చాల్లేవు. శివరావు బావ తన్నెప్పుడూ ఒక్క మాట అని ఎరగడు. అప్పు డప్పుడూ తనే మాట తూలినా, ఆయన ఏమనుకోడు.

నిజంగా తాను అదృష్టవంతురాలే!

నిద్రలోకి జారుకుంది సుబ్బులు, ఆలోచనల్ని పక్కకు నెట్టివేసి.

అర్ధరాత్రి వెక్కిళ్ళు వినిపిస్తే నిద్ర లేచింది సుబ్బులు. ప్రక్కకి తిరిగి చూస్తే ప్రమీల దిండును కౌగి లించుకొని ఏడుస్తోంది. కళ్ళు మూసుకొనే ఉంది కానీ, కన్నీరు ప్రవహిస్తోంది. పలకరించాలో, లేదో తెలియలేదు సుబ్బులుకి. అయినా పలకరించడానికి ధైర్యం చాలక ఊరకుండిపోయింది.

మరునటి రోజు ఉదయం—


''ప్రమీల వాళ్ళింటికి ఇక నేను వెళ్ళను.'' బెత్తంతో కొట్టే మాస్టారు గుర్తుకు వచ్చి బడికి వెళ్ళననే పాపలా అంది సుబ్బులు.

''ఏం జరిగింది?'' అని అడగలేదు శివరావు.

''ఈరోజు జీతాలిస్తారు. ఇంటికి వచ్చేటప్పుడు పెద్ద అద్దం కొను క్కొస్తాలే!'' అన్నాడు శివరావు.

''వద్దు...వద్దు. ముందు చెప్పులు కొనుక్కో'' అంది చెప్పుల్లేని అతని కాళ్ళకేసి చూస్తూ సుబ్బులు. *

నూతన యవ్వనం పొందండి.
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాల మందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టుద్వారా చికిత్స కలదు

ప్రతి ఆదివారము భీమవరం - షణ్ముఖలాడ్జి నందు ఉ॥ 9 నుండి సా॥ 6-30 వరకు క్యాంపు కలదు.

డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్క్ రోడ్, గుడివాడ-521 301.
ఫోన్స్ : 522 అండ్ 540